

## శిశు గృహానికి చేరిన నవజాత శిశువు

మట్టిలో పాతి పెట్టిన కిరాతకులు

54రోజులు చికిత్స అందించిన ఎంజీఎం వైద్యులు

2 లో..

వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 312 శుక్రవారం | 28 జూన్ 2024 | పేజీలు : 08 | వెల రూ. 5



# మేడిపండు మెడికవర్



**ప్రారంభోత్సవానికి సీఎం అత్యుత్సాహం**

**ప్రజల్లోకి రాంగ్ సందేశం**

**వంతపాడుతున్న కాంగ్రెస్ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు**

**తప్పుపడుతున్న ప్రజా, విద్యార్థి సంఘాలు**

**మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభోత్సవం ఎప్పుడంటూ ప్రశ్న**

రాష్ట్ర ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించాల్సిన ప్రభుత్వం ప్రైవేట్ వైద్యాన్ని ప్రోత్సహించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలకు పెద్ద దిక్కుగా ఉన్న ఎంజీఎంలో పేరుకుపోయిన సమస్యలతో రోగులకు కనీస వైద్యం కూడా అందని పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావొస్తున్నా.. ఒక్కనాడు కూడా ప్రభుత్వ ఆస్పత్రుల బలోపేతంపై ఆలోచించని ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వైద్యాన్ని వ్యాపారం చేసిన ప్రైవేట్ ఆస్పత్రి ప్రారంభోత్సవానికి రావడం విడ్డూరంగా ఉందని పలువురు ఆక్షేపిస్తున్నారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన సీఎం ప్రైవేట్ దవాఖానాను ప్రారంభించడం ద్వారా ప్రజలకు రాంగ్ మెసేజ్ ఇస్తున్నారంటూ మండిపడుతున్నారు. ఆయన దుందుడుకు చర్యలతో తిరిగి నేను రాను బిడ్డో సర్కారు దవాఖానాకు అనాల్సిన రోజులు వచ్చే ప్రమాదం ఉందంటున్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో ఇప్పటికే కేఎంసీలో ఏర్పాటు చేసిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యుల కొరత పట్టి పీడిస్తోంది. అరకొరగానే వైద్యం అందుతోంది. అదే విధంగా 24 అంతస్తుల భవనం 34 విభాగాల్లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందించాల్సిన ఆసుపత్రి నిర్మాణ పనులు ఆగుతూ సాగుతున్నాయి. సీఎం, ఆరోగ్య మంత్రి ప్రైవేట్ ఆస్పత్రుల మేనియాలో పడకుండా ప్రభుత్వ ఆస్పత్రులపై దృష్టి పెట్టాలని ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. - వరంగల్ వాయిస్, వరంగల్

వివరాలు 2లో..



8లో

## విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



8లో

## చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మంత్రి సురేఖకు వినతి



8లో..

## పీవీకి ఘన నివాళి

స్వగ్రామంలో 103వ జయంతి వేడుకలు

ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్

# మేడిపండు మెడికవర్



**ప్రారంభోత్సవానికి సీఎం అత్యుత్సాహం**

**తొలి పర్యటన ప్రైవేట్ ఆస్పత్రి ప్రారంభానికా?**

**ప్రజల్లోకి రాంగ్ సందేశం**

**వంతపాడుతున్న కాంగ్రెస్ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు**

**తప్పుపడుతున్న ప్రజా, విద్యార్థి సంఘాలు**

**మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభోత్సవం ఎప్పుడంటూ ప్రశ్న**




**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన ఓరుగల్లు గడ్డపై ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి మొట్టమొదటి పర్యటనను నిర్వహించడం సంతోషకరమై అంశమే అయినప్పటికీ ఆయన టూర్ లో ప్రైవేట్ కార్యక్రమాలకు పెద్దపీట వేయడం వివాదాస్పదంగా మారింది. అనుకున్నది ఒక్కటి అయిందొక్కటి అన్నట్టుగా తొలి పర్యటనలోనే ఒక ప్రైవేటు హాస్పిటల్ ప్రారంభోత్సవానికి రావడం సర్వత్రా ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ప్రజా పాలన, ప్రజా ప్రభుత్వం అంటూనే ముఖ్యమంత్రి హోదాలో వైద్యాన్ని వ్యాపారం చేస్తున్న మెడికవర్ ఆస్పత్రి ప్రారంభించేందుకు రావడాన్ని ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. అసలు ఓరుగల్లు నగర సమస్యలపై చర్చించేందుకు నగరానికి వస్తున్నారా లేక మెడికవర్ ఆస్పత్రి ప్రారంభించేందుకు వరంగల్ టూర్ ఖరారు చేసుకున్నారా అన్న విమర్శలు ఎదురవుతున్నాయి.

### వెల్లువెత్తుతున్న విమర్శలు..

వరంగల్ నగరంలోని హంటర్ రోడ్డులో కోట్ల రూపాయలు వెచ్చించి నాలుగు అంతస్థుల్లో నిర్మించిన మెడికవర్ ఆస్పత్రి ప్రారంభానికి ముఖ్యమంత్రి రావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పేదలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించాల్సిన ప్రభుత్వ ఆస్పత్రులను ప్రోత్సహించాల్సిన ఆయన ప్రైవేట్ వైద్యాన్ని ప్రోత్సహించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సొంత అవసరాలు, పార్టీ అవసరాల కోసమే మెడికవర్ ఆస్పత్రి ప్రారంభానికి సీఎం వస్తున్నారంటూ భగ్గుమంటున్నారు.

### వంతపాడుతున్న నేతలు..

స్థానిక అధికార పార్టీ నేతలకు మెడికవర్ బంగారు బాతులా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అందుకే ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రైవేట్ ఆస్పత్రి ప్రారంభోత్సవానికి విశేష ప్రచారాన్ని కల్పిస్తున్నారని మండిపడుతున్నారు. వైద్యం పేరుతో పేదల రక్తాన్ని తాగే మెడికవర్ ఆస్పత్రి ప్రారంభోత్సవానికి సీఎం రావద్దంటూ హితవు పలుకుతున్నారు. ప్రైవేట్ వైద్యం 'దందా'ను అరికట్టాల్సిన ఆయన అందుకు విరుద్ధంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రభుత్వ ఆస్పత్రులు బలోపేతం చేయాలి..

తెలంగాణకు తలమానికంగా ఉన్న ఎంజీఎం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో వసతులు మెరుగు పరచకుండా ప్రభుత్వం వ్యవహరించడాన్ని తప్పుబడుతున్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి రెండు ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలని కోరుతున్నారు. అదే విధంగా ఆగుతూ సాగుతున్న 24 అంతస్థులు మల్టీ స్పెషాలిటీ ఆస్పతి పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలంటున్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలంటున్నారు. జిల్లా, ఏరియా, పీహెచ్ సీల మధ్య భౌగోళిక కనెక్టివిటీపై దృష్టి సారించాలంటున్నారు. అర్బన్, రూరల్ హెల్త్ సెంటర్లలో మౌలిక వసతులు సమకూర్చాలని కోరుతున్నారు.

### తనిఖీలేవి..

300పడకలతో నిర్మిస్తున్న మెడికవర్ ఆస్పత్రిలో ఇంకా నిర్మాణ పనులు కొనసాగుతున్నా ముఖ్యమంత్రి రేవంత్ మాత్రం శనివారం హడావిడిగా ప్రారంభించేందుకు ఏర్పాటు చేయడం ఏంటని ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. అందులో పూర్తి స్థాయి ఇక్విపిమెంట్ కూడా ఏర్పాటు చేయలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆస్పత్రిలో పలు లోపాలున్నప్పటికీ సీఎం ద్వారా ప్రారంభోత్సవం చేస్తే అన్నీ బారాకుల్ అవుతాయన్న తలంపుతోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు విమర్శలొస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకొని అసంపూర్తిగా ఉన్న మెడికవర్ ప్రారంభోత్సవాన్ని నిలిపివేయాలని స్థానికులు కోరుతున్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ రూల్స్ పాటించకపోతే కార్పొరేట్, హాస్పిటల్ లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# స్టేషన్ ఘన్‌పూర్‌లో ప్రభుత్వ అస్పత్రి

**100 పడకలతో ఏర్పాటు**

**స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘన్ పూర్ :** స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్మించనున్న 100పడకల ప్రభుత్వ అస్పత్రి నిర్మాణానికి ఆర్టీసీకి సంబదించిన స్థలాన్ని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందుబాటులో ఉంచాలానే లక్ష్యంతో పని చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలో ప్రజలందరికి అందుబాటులో ఆర్టీసీకి చెందిన నాలుగు ఎకరాల స్థలం ఉందని, ఆ స్థలం ఏరియా అస్పత్రి నిర్మాణానికి అనువైనదన్నారు. 2001లో ఆర్టీసీ డిపో ఏర్పాటు కోసం ప్రైవేట్ స్థలాన్ని కొనుగోలు చేసి ఆర్టీసీ సంస్థ అప్పగించడం జరిగిందని కానీ 23సంవత్సరాలు గడిచినా ఆ స్థలాన్ని ఆర్టీసీ వినియోగించుకోలేకపోయిందన్నారు. నిరూపయోగంగా ఉన్న ఆ స్థలాన్ని వైద్య ఆరోగ్య శాఖకు బదలాయిస్తే 100పడకల ఏరియా అస్పత్రి నిర్మాణానికి సరిపోతుందని తెలిపారు. దీనిపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు వీలైనంత తొందరలో రాష్ట్ర ప్రభుత్వం ఆ స్థలాన్ని బదలాయించి అస్పత్రి నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పాటు సరిపడా సిబ్బందిని వెంటనే నియమించాలని కోరారు. అదే విధంగా మండలానికి ఒకటి చొప్పున అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన



విద్యాలయాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గంలో విద్యా ప్రమాణలను మెరుగు పరిచి ఉన్నతమైన, నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందే విధంగా అలాగే పాఠశాలలో అన్ని రకాల సదుపాయాలు కల్పించి, విద్యార్థులకు, తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శిశు గృహానికి చేరిన నవజాత శిశువు

**మట్టిలో పాతి పెట్టిన కిరాతకులు**

**54రోజులు చికిత్స అందించిన ఎంజీఎం వైద్యులు**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గత మే నెల 4న దామెర మండలం ఊరుగొండ సమీపంలో అప్పుడే పుట్టిన బిడ్డను మట్టిలో పాతి పెట్టిన విషయం పాఠక లోకానికి తెలిసిందే. అలాంటి దుశ్చర్యకు పాల్పడిన సంఘటన విషయం లారీ డ్రైవర్ చూసి సమీపంలో పని చేస్తున్న వారికి, పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న దామెర ఎస్ఐ తన వాహనంలో స్థానిక ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించిన పిల్లల వైద్యులు నవజాత శిశువు బరువు అతి తక్కువగా ఉన్నందున ప్రత్యేక వైద్య సహాయం అందించి ఆరోగ్యం కుదుటపడిన తర్వాత తదుపరి పునరావాసం నిమిత్తం శిశు గృహకు అప్పగిస్తామని చెప్పారు. సరిగ్గా నేటితో యాభై ఆరు రోజుల తర్వాత నవజాత శిశువు ఉండాల్సిన బరువు ఉన్నదని నిర్ధారించి జిల్లా బాలల పరిరక్షణ విభాగం శిశు గృహ బాధ్యులకు ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వలుపదాసు చంద్రశేఖర్, పీడియాట్రిషన్ హెచ్ ఓడీ డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో అప్పగించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి కె.మధురిమ మాట్లాడుతూ పిల్లలు, ముఖ్యంగా ఆడ పిల్లలు వద్దు అనుకునే వారు నేరుగా సంప్రదించి శిశు గృహకు అప్పగించినట్లయితే వారిని చట్టబద్ధమైన దత్తతకు అప్పగిస్తామని అన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్పర్సన్ అన్నమనేని అనిల్ చందర్ రావు మాట్లాడుతూ కేంద్ర దత్తత వనరుల విభాగం నిబంధనల ప్రకారం నవజాత శిశువు చట్టబద్ధమైన దత్తత ప్రక్రియకు తగు చర్యలు తీసుకోవాలని, ఈ లోగా నవజాత శిశువు తల్లితండ్రులు, బంధవులు సంబంధిత విభాగం అధికారులను లేదా చైల్డ్ వెల్ఫేర్ కమిటీని సంప్రదిస్తే శిశువును అప్పగిస్తామని, నిబంధనల గడువులోగా సంప్రదించకుంటే అధికారులకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. అందుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ ఇంచార్జి అధికారి ఎస్.ప్రవీణ్ కుమార్, శిశు గృహ మేనేజర్ దూడం నగేష్, శిశు గృహ సోషల్ వర్కర్ సంగి చైతన్య, ఔట్ రీచ్ వర్కర్ పి.విజయ్ కుమార్, చైల్డ్ హెల్ప్ లైన్ కౌన్సిలర్ కె.రజిత తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాకతీయుల సామ్రాజ్య ఘన కీర్తిని చాటటానికి ఓరుగల్లు వైభవాన్ని ప్రపంచ నలుదిశలా వ్యాపింప చేయడానికి కాకతీయుల ఉత్సవాలను నిర్వహించాలని, సమ్మక్క సారలమ్మ, వేయి స్తంభాల ఆలయ ప్రభను రానున్న తరాలకు తెలియజేసేందుకు ఈ ఉత్సవాలు ఎంతగానో దోహదం చేస్తాయని తెలంగాణ డ్రమెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల సదానందం అన్నారు. సంస్థ బాధ్యులు వాడపల్లి చక్రపాణి, కోడూరు బాలాజీ, సీతా వెంకటేశ్వర్లు, వనపర్తి రాజేంద్రప్రసాద్, ప్రచార కార్యదర్శి నిమ్మల శ్రీనివాస్ లతో కలిసి మంత్రి కొండా సురేఖను కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో వేలాది మంది నాటక కళాకారులు ఉన్నారని, ఈ ఉత్సవాలు నిర్వహించడం వల్ల వారి ప్రతిభను ప్రదర్శించడానికి సువర్ణ అవకాశం దక్కుతుందని, అలాగే కాళోజీ కళాక్షేత్రంలో నాటకాలకు అడుగుణంగా స్టేజి నిర్మాణంలో మార్పులు చేయాలని మంత్రిని కోరారు. గతంలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లినట్లు మంత్రికి తెలిపారు. వినతి పత్రం స్వీకరించిన మంత్రి సానుకూలంగా స్పందించి తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని ఆర్థిక సహాయం వచ్చేలా ముఖ్యమంత్రి, సంబంధిత అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని తెలిపారు.

## సెల్‌ఫోన్లు అప్పగింత



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఏనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ వ్యక్తులు పోగొట్టుకున్న మూడు సెల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఏనుమాముల టెక్ టీం ఆచూకీ కనుగొని, కమిషనర్ ఆఫ్ పోలీస్, వరంగల్ ఆదేశాల మేరకు పోగొట్టుకున్న వ్యక్తులకు వారి సెల్ ఫోన్ లను శుక్రవారం ఏనుమాముల ఇన్ స్పెక్టర్ పులి రమేశ్, ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో అప్పగించారు. ఈ సందర్భంగా టెక్ టీం విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ విజయ్ ను సీఐ అభినందించారు.

## విద్యుత్ షాక్‌తో దుక్కిటేద్దు మృతి



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** మండలంలోని అడవి రంగాపూర్ గ్రామానికి చెందిన రైతు దామెర శేషమ్మ దుక్కిటేద్దు విద్యుత్ షాక్ తో మృతి చెందింది. గురువారం మేతకు వెళ్లిన ఎద్దు రాకపోవడంతో శేషమ్మ తన కుమారుడు ఎద్దు కోసం వెతకడం మొదలు పెట్టారు. ఈ క్రమంలో ఎద్దు విద్యుత్ షాక్ గురై మృతి చెంది ఉన్నట్టు శేషమ్మ తెలిపారు. మృతి చెందిన ఎద్దు విలువ రూ.60 వేల ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఎద్దు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు ,వెటర్నరీ అధికారులు శుక్రవారం ఉదయం గ్రామానికి వెళ్లి పంచనామా చేసినట్లు తెలిపారు.

## మండల కేంద్రంలో ప్రజావాణి

**వరంగల్ వాయిస్, మల్హర్ :** భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అదేశాల మేరకు ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు మండల తహసీల్దార్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రజావాణి కార్యక్రమం ఉంటుంది. కాబట్టి, మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు.

## మైనర్లు డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు

### ట్రాఫిక్ సీఐ శ్రీధర్



**వరంగల్ వాయిస్ కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడగా వారిని గుర్తించి శుక్రవారం జువెనల్ కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేయగా వారికి ఒక రోజుల బాలల అబ్జర్వేషన్ హోంకు పంపించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ కే. శ్రీధర్ మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



**వరంగల్ వాయిస్, నడికూడ :** ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రజా సంక్షేమ వేదిక రాష్ట్ర నాయకుడు శనిగరపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం పరకాలలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో కమిటీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. రాష్ట్రంలోని అనేక ప్రభత్వ గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు లేక అద్దె భవనాలలో ఉంటూ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయని, విద్యార్థులకు సరైన మరుగుదొడ్లు, మంచి నీటి సౌకర్యం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా గురుకుల పాఠశాలల్లో సరిపడా ఉపాధ్యాయులు లేరన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో వెంటనే నిధులు మంజూరు చేసి సొంత భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఏకశిల డీజీ స్కూల్‌ను సీజ్ చేయాలి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** శివ నగర్ వరంగల్ లో ఎటువంటి అనుమతి లేకుండా ప్రజలకు, విద్యార్థులకు సీబీఎస్ఈ పేరుతో మోసం చేస్తూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లక్షలాది రూపాయల ఫీజులను వసూలు చేస్తున్న ఏకశిల డీజీ స్కూల్ ను తక్షణమే సీజ్ చేయాలని ఏఐఎస్ బీ నాయకులు అధికారులను డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ వారి భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న ఏకశిల డీజీ స్కూల్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ బీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ రోహిత్ మాట్లాడుతూ శివనగర్ లో ప్రభుత్వం నుంచి ఒకటే ఏకశిల స్కూల్ కు 36121001040 కోడ్ తో అనుమతి తీసుకొని , విద్యార్థులకు తల్లిదండ్రులకు తప్పుదోవ పట్టిస్తూ ఏకశిల యాజమాన్యం రెండు ఏకశిలా స్కూలు నడుపుతున్నారనే ఆధారాలతో ఖిల్లా వరంగల్ ఎంఈఓ దృష్టికి తీసుకుపోయిన ఎంఈఓ స్పందించడం లేదన్నారు. గత నెల రోజులుగా చర్యలు తీసుకోకుండా ఏకశిల యాజమాన్యానికి పరోక్ష సహాయ సహకారాలు అందిస్తున్నారని ఆరోపించారు.తక్షణమే వరంగల్ డీఈఓ అనుమతి లేని ఏకశిల స్కూల్‌ను సీజ్ చేయాలని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న ఏకశిల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, అనుమతిలేని స్కూల్ యాజమాన్యానికి పరోక్షంగా సహకరిస్తున్న ఎంఈఓపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే ఈ అంశాన్ని బోర్డు దృష్టికి తీసుకుపోతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ మోహన్ పాల్గొన్నారు.

## గ్రీన్ ఫీల్డ్ రోడ్డు హైవేను ఆపేసి బ్రౌన్ ఫీల్డ్ రోడ్డుగా మార్చాలి

### సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నేత రాచర్ల బాలరాజు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మహారాష్ట్రలోని నాగపూర్ నుంచి ఆంధ్రప్రదేశ్ లోని అమరావతి వరకు మోడీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు వల్ల వేలాది రైతు కుటుంబాలు ఆగమవుతున్నాయని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ వరంగల్ ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యులు రాచర్ల బాలరాజు అన్నారు. గత మూడు సంవత్సరాలుగా పచ్చని పంట పొలాల్లో రోడ్డు నిర్మాణం కోసం ఉమ్మడి వరంగల్ జిల్లాలో కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వ అధికారులు సర్వేలు చేస్తూ బలవంతపు భూసేకరణకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. తమ భూములు రోడ్డు నిర్మాణానికి ఇచ్చేది లేదని, రైతులు ఖరాఖండిగా చెప్పినప్పటికీ పోలీస్ ప్రయోగంతో సర్వేలు చేసి హద్దులు పాతుతున్నారు. రైతులకు వ్యవసాయమే వృత్తిగా ఉన్న పంట పొలాలను కేంద్ర ప్రభుత్వం, ఈ దేశ దోపిడీదారులైన కార్పొరేట్ల పేరుతో ఊరేగుతున్న అంబానీ, ఆదానీల ప్రయోజనాల కోసం బలి చేస్తున్నది పంట పొలాలు తమకు దక్కే పరిస్థితి లేదని, తమ పిల్లల భవిష్యత్తు అంధకారం అవుతుందని తట్టుకోలేక రైతులు బలవంతపు మరణానికి పాల్పడుతున్నారు. రైతుల భూమిని లాక్కొని కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నష్ట పరిహారంతో వారి కుటుంబాలు బ్రతికే పరిస్థితి లేదు. గతంలో అధికారంలో కొనసాగిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రైతులకు నష్టపరిహారం గురించి మాట్లాడారు తప్ప వారి భూములను కాపాడడానికి ముందుకు రాలేదు. రాష్ట్రంలో పాదయాత్ర చేపట్టిన సందర్భంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణాన్నివ్యతిరేకించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ కు వస్తున్న సందర్భంగా తమ ప్రభుత్వం గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ అదే స్థానంలో బ్రౌన్ ఫీల్డ్ నిర్మాణానికి అనుకూలంగా తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఎంఈఓ, డీఈఓలను సస్పెండ్ చేయాలి

### ఏబీవీపీ వరంగల్ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** ఎంఈఓ, డీఈఓలను సస్పెండ్ చేయాలని కోరుతూ అఖిల భారత విద్యార్థి పరిషత్ వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నర్సంపేట ఆర్డీఓ కృష్ణవేణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ వరంగల్ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యావ్యవస్థ మెరుగుపడుతుందనుకుంటే, పూర్తిగా నాశనం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మద్యానికి ఉన్న విలువ విద్యకు లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో విద్యా శాఖకు మంత్రి లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. నేడు రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రైవేట్, కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలలో అక్రమంగా లక్షల లక్షలు ఫీజులు వసూలు చేస్తున్న యజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలనీ, రాష్ట్రంలో ఫీజు నియంత్రణ చట్టం అమలులోకి తీసుకురావాలని, ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని, వెంటనే ఎంఈఓ, డీఈఓలను నియమించాలని గామాండ్ చేశారు. మెగా డీఎస్సీ ద్వారా ఒకేసారి 24వేలకు పైగా ఖాళీగా ఉన్నటువంటి టీచర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలలో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు, నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పెడుతున్న మధ్యాహ్న భోజనంలో జరుగుతున్న అవకతవకల పైన విచారణ జరిపించి నాణ్యతలేని ఆహారాన్ని అందిస్తున్న అధికారుల పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలలో అటెండర్, స్కావెంజర్లను నియమించాలని కొరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొన్నాల శశికుమార్, కార్యకర్తలు ఆది, సూర్యతేజ, హేమంత్, సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.

# పీవీ ముందు చూపుతోనే దేశాభివృద్ధి

## టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టీజీఎన్పీడీసీఎల్) కార్పొరేట్ కార్యాలయం, విద్యుత్ భవన్ లో శుక్రవారం భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 103వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా సంస్థ ఛైర్మెన్ అండ్ మెనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి, ఇంచార్జి డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.మోహన్ రావు, వి.తిరుపతి రెడ్డి, ఛీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్ధన్ పీవీ నరసింహా రావు చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అందరు ఉద్యోగులు పూలు చల్లి శ్రద్ధాంజలి ఘటించారు. తదనంతరం సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ పీవీ నర్సింహారావు సరళీకృత ఆర్థిక విధానాల అమలు ఫలితంగా దేశంలో అందరికి అవకాశాలు పెరిగాయన్నారు. తెలంగాణ ముద్దు బిడ్డ అపర చాణక్యుడిగా పేరు గడించిన పీవీ ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. రాష్ట్ర, కేంద్ర మంత్రి పదవులతో పాటుగా ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రిగా పదవులకే వన్నె తెచ్చిన గొప్ప వ్యక్తి అని ఆయన అన్నారు. సాహిత్య కృషికి ఆయన ఎన్నో పురస్కారాలను అందుకున్నారని, రాష్ట్ర దేశ పురోగభివృద్ధికి ఆయన సేవలు ప్రతి ఒక్కరు ఆచరించాలని కోరారు. పీవీ దేశ ఆర్థిక వ్యవస్థకు పునర్జీవనం కల్పించేందుకు బీజం వేసిన సంస్కరణలే మనం అనుభవిస్తున్నామని అన్నారు. ఆయన దేశానికి అందించిన సేవలు హర్షనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డైరెక్టర్లు (హెచ్ఆర్డీ) బి.అశోక్ కుమార్, డైరెక్టర్(ప్రాజెక్ట్స్) టి.సదర్ లాల్, డైరెక్టర్(ఆపరేషన్) శ్రీ వి.మోహన్ రావు, డైరెక్టర్(ఫైనాన్స్) వి.తిరుపతి రెడ్డి, ఛీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్ధన్, సీజీఎంలు కె.తిరుమల్ రావు , టి.మధుసూదన్, కె.కిషన్, రాజుచౌహాన్, కెఎన్.గుట్ట, జాయింట్ సెక్రటరీ కె.రమేష్, జీఎంలు నాగప్రసాద్, గిరిధర్, మనోహర స్వామి, శ్రీకృష్ణ, వేణుబాబు, మాధవరావు, శ్రీనివాస్, దేవేందర్, సత్యనారాయణ , అన్నపూర్ణ, ఎస్ఈ సివిల్ అంకూస్, ఇంజినీర్స్, అకౌంట్స్, పీఅండ్ జీ, ఆర్టిజన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు పీవీ

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** విప్లవాత్మక ఆర్థిక సంస్కరణల మార్గదర్శి, బౌభాష కోవిదుడు, దేశ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. దేశం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా శుక్రవారం శాయంపేట మండల కేంద్రంలో బస్టాండ్ సెంటర్ లో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పీవీ జయంతి వేడుకల్లో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విప్లవాత్మక సంస్కరణలు, సాహసోపేత నిర్ణయాలతో భారతదేశం బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు పీవీ పునాదులు వేశారని గుర్తుచేశారు. ఏ పదవి చేపట్టిన దానికి వన్నె తీసుకొచ్చారన్నారు. ఆయన విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో గురుకుల విద్యను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో నవోదయ పాఠశాలలను ప్రారంభించి, జైళ్ల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఓపెన్ జైల్ అనే పద్ధతికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, మండల అధికార ప్రతినిధి చిందం రవి, మాజీ సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి, నాయకులు పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, చల్ల చక్రపాణి, కొమ్ముల భాస్కర్, రేణి కుంట్ల సదయ్యా, మారేపల్లి రవీందర్, రంగు బాబు, మారేపల్లి కట్టయ్య, మారేపల్లి రాజేందర్, ఎండీ సాదిక్, బాసని మార్కండేయ, శంకర్, శాంతా రవి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# సరళీకృత ఆర్థిక విధానాల రూపకర్త పీవీ

## ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** సరళీకృత ఆర్థిక విధానాలతో దేశానికి సరికొత్త మార్గాన్ని నిర్ధేశించిన దార్శనికుడు తెలుగుజాతి ముద్దుబిడ్డ, బహుభాషా కోవిదులు, పూర్వ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పీవీ నరసింహారావు చిత్రపటానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు ఒంటేరు శ్రవణ్, ఎంపీటీసీ మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ రవి, బ్లాక్ కాంగ్రెస్ వీర్ల చిన్ని, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం శివకుమార్, సీనియర్ నాయకులు కొలుగూరి రాజేశ్వరరావు, చిన్నాల గొనాథ్, దాసరి భిక్షపతి నేత, చిట్టిరెడ్డి వెంకట్ రెడ్డి, ఆముదాలపెల్లి క్రాంతి, దుబాసి వెంకటస్వామి, లక్కం శంకర్, మెరుగు శ్రీనివాస్, గూడెల్లి సదన్, రజినీకాంత్, చిర్ర రాజన్న, రాజేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథ నిర్ధేశకుడు పీవీ నరసింహా రావు

## పీవీ జ్ఞానభూమి వద్ద వకుళాభరణం నివాళి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** దేశంలో సంక్షేమ పథకాల అమలులో ఆద్యుడిగా మాజీ ప్రధాని పీవీ నరసింహా రావు చరిత్ర పుటలలో చిరస్థాయిగా నిలిచి ఉంటారని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అన్నారు. 103వ జయంతి సందర్భంగా శుక్రవారం నెక్లెస్ రోడ్డులోని పీవీ జ్ఞానభూమిలో స్మారక స్థలం వద్ద పుష్పాలు సమర్పించి ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అక్కడ పాత్రికేయులతో మాట్లాడుతూ పీవీ నరసింహా రావు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా చేసిన సేవలను డాక్టర్ వకుళాభరణం కొనియాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా, దేశంలో ప్రధానమంత్రిగా బీసీలకు విద్యా, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లను అమలులోకి తెచ్చిన ఘనత పీవీ దే అన్నారు. కార్పొరేట్ విద్యను పేదలకు అందుబాటులోకి తేవాలని రాష్ట్రంలో రెసిడెన్షియల్ పాఠశాలలను, దేశవ్యాప్తంగా నవోదయ పాఠశాలలను నెలకొల్పింది పీవీనే అని తెలిపారు. జాతీయ స్థాయిలో పీవీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడే, జాతీయ స్థాయిలో బీసీ కమిషన్, మైనారిటీ కమిషన్లు, బీసీ ఆర్థిక కార్పొరేషన్లు ఏర్పడ్డాయన్నారు. సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు పెరిగితేనే, దేశం ప్రగతిపథంలో ముందుకు వెళ్లడానికి సాధ్యమని భావించిన పీవీ, బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక పథకాలు ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. తన స్వస్థలం హుజూరాబాద్ సమీపంలోని వంగర గ్రామం నుంచి పీవీ అంచెలంచెలుగా దేశ ప్రధానమంత్రిగా ఎదగడం తనలాంటి వారికి జీవితంలో గొప్ప అనుభూతిని ఇచ్చే అంశమని ఆయన తెలిపారు.

# పీవీ నరసింహారావు సేవలు మరువలేనివి



**వరంగల్ వాయిస్, న్యూఢిల్లీ :** స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి పీవీ.నర్సింహారావు 104వ జయంతి సందర్భంగా భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్లమెంటరీ పార్టీ లీడర్ కే.ఆర్.సురేష్ రెడ్డి, డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, విప్ దీవకొండ దామోదర్ రావులు ఢిల్లీలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలు జల్లి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీవీ దేశానికి చేసిన సేవల్ని గుర్తు చేసుకున్నారు.

# తెలుగుజాతి ముద్దుబిడ్డ పీవీ

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆర్థిక సంస్కరణలతో దేశానికి దిశానిర్దేశం చేసిన ప్రజ్ఞాశాలి, బహుముఖ ఆర్థికవేత్త, బహుభాషా కోవిదుడు, దివంగత మాజీ ప్రధాని, తెలుగుజాతి ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాయంలో ఆయన చిత్ర పటానికి, హనుమకొండ బస్టాండ్ కూడలిలో ఉన్న కాంస్య విగ్రహానికి వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ అనర్గళంగా 17 భాషలు మాట్లాడగలిగిన బహుముఖ ప్రజ్ఞాశాలి బహుబాషా కోవిదుడు అర్ధశాస్త్రం, చరిత్ర, చట్టం, రాజకీయాలు, కళలు లాంటి రంగాలలో పట్టున్న వ్యక్తి ఆయన అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎంపీ, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, టీపీసీసీ కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ రావు, కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మొహమ్మద్ అజీజ్ ఖాన్, బంక సరళ, మానస, రాంప్రసాద్, గుంటి స్వప్న, తాళ్లపల్లి మేరీ, బండారి జనార్ధన్, నల్ల సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ ఏ.నాగరాజు, గాండ్ల స్రవంతి, మొహమ్మద్ జాఫర్, కట్ట రఘుపాల్ రెడ్డి, మండల సమ్మయ్య, కొన శ్రీకర్, బంక సతీష్ యాదవ్, వాళ్లపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గొప్ప ఆర్థిక సంస్కరణ వేత్త పీవీ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తొలి తెలుగు ప్రధాని, గొప్ప ఆర్థిక సంస్కరణ వేత్త, తెలంగాణ ముద్దు బిడ్డ, బహుభాషావేత్త పీవీ నరంసింహారావు జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి మాజీ ప్రభుత్వ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్వీ నాయకులు, జిల్లా కో ఆర్డినేటర్స్ డాక్టర్ అరూరి రంజిత్ కుమార్, డాక్టర్ కంజీరల మనోజ్ కుమార్, బైరపాక ప్రశాంత్, పి. శ్రీకాంత్, గంద్రకోట రాకేష్ యాదవ్, రాష్ట్ర నాయకులు డాక్టర్ కంజీరాల మనోజ్ కుమార్, కేయూ, జిల్లా నాయకులు కలకోట్ల సుమన్, గొల్లపల్లి వీరస్వామి, పిట్టల కళ్యాణ్, పస్తం అనిల్ తదితరులు ఉన్నారు.

# గొప్ప దార్శనికుడు పీవీ నరసింహా రావు



**వరంగల్ వాయిస్, కేయూ :** "గొప్ప దార్శనికుడు పి.వి.నరసింహా రావు" అని కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ పీవీ విజ్ఞాన కేంద్రం సంచాలకుడు డాక్టర్ జి.కిష్టయ్య ఆధ్వర్యంలో శుక్రవారం విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన పీవీ నరసింహ రావు జయంతి సందర్భంగా అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశాన్ని ప్రపంచంలోనే ఉన్నతంగా చేసిన వ్యక్తి, ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని ముందుకు తీస్కొని పోయిన వ్యక్తి పీవీ నరసింహ రావు అని కొనియాడారు. అంతే కాకుండా పూర్వపు ఆంధ్రప్రదేశ్ లో భూ సంస్కరణలకు మార్గం చేసిన వ్యక్తి కుడా పీవీ అని గుర్తు చేశారు. అయన స్ఫూర్తిని నేటి తరం విద్యార్థులు, ఉద్యోగులు కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.నరసింహ చారి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి, విభాగ అధిపతులు డాక్టర్ రమ, డాక్టర్ ఆర్.భారవి శర్మ, డాక్టర్ సంకేనేని వెంకట్, డాక్టర్ సోమయ్య, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ పి.వెంకటయ్య, డాక్టర్ రమేష్, డాక్టర్ సాయిదా, డాక్టర్ మమత, డాక్టర్ వంగాల సుధాకర్, బుర్రా సృజన తదితర ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టాలి

## విద్యార్థి సంఘాల డిమాండ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బాలసముద్రంలోని హయగ్రీవచారి ప్రాంగణంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న కాళోజీ కళాక్షేత్రానికి గద్దర్ పేరు నామకరణం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అంతేకాకుండా కళాక్షేత్రం ముందు గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటులో ప్రధానపాత్ర పోషించి, తెలంగాణ ప్రజలను నిత్యం చైతన్యవంతులను చేసిన గద్దర్ కళలకు ప్రతిరూపం అని తెలిపారు. అంతర్జాతీయంగా తెలంగాణ కళలను ప్రచారం చేసిన ఘనుడు గద్దర్ అని కొనియాడారు. కాళోజీ అంటే మాకు గౌరవం ఉందని, కానీ కళలకు ఆయనకు సంబంధం లేదన్నారు. ఇప్పటికే వరంగల్ లో కాళోజీ పేరుతో ఓ మెడికల్ కాలేజీ ఉందని గుర్తు చేశారు. ప్రభుత్వం కూడా నంది అవార్డుల పేరును గద్దర్ అవార్డులుగా మారుస్తున్నట్లు ప్రకటించిందని గుర్తుచేశారు. కాబట్టి కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టి, దాని ముందు గద్దర్ విగ్రహం ఏర్పాటు చేసి ప్రభుత్వమే అధికారికంగా ప్రారంభించాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ కు వినతి పత్రం ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేష్, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, ఓయూ ఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక సురేష్, టీజీవీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మేడ రంజిత్, బీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కడపాక రాజేందర్, బొట్ల తేజ, సురేందర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## కంప్యూటర్ సైన్స్ సబ్జెక్ట్ అతిథి అధ్యాపకుల నియామక దరఖాస్తుల ఆహ్వానం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని రంగశాయిపేట స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టు బోధించుటకు ఆతిథి అధ్యాపకుల (01) నియామకానికి కళాశాల విద్యాశాఖ కమిషనర్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ వారు అనుమతి మంజూరు చేయడం జరిగింది. యూజీసీ నిబంధనల ప్రకారం సంబంధిత సబ్జెక్టులో పీజీలో 55శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అయితే 50 శాతం మార్కులు కలిగి ఉండాలి. నెట్, సెట్, పీహెచ్ డీ అర్హత గలవారికి ప్రాధాన్యత ఇవ్వబడునని పేర్కొన్నారు. కాబట్టి, అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డా.జి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు జులై 3 సాయంత్రం 5:00 లోగా తమ దరఖాస్తులను కళాశాల యందు అందజేయాలని కోరారు. ఇంటర్వ్యూ జూలై 4 ఉదయం 10:30 నిమిషాలకు కళాశాల ప్రాంగణంలో నిర్వహించబడును అని తెలిపారు

## పద్మశాలి కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని పత్తిపాక గ్రామంలో పద్మశాలి భవన నిర్మాణానికి భూపాలపల్లి శాసనసభ్యుడు గండ్ర సత్యనారాయణ రావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ పత్తిపాక గ్రామంలో పద్మశాలి కమ్యూనిటీ భవన నిర్మాణానికి సీడీఎఫ్ నుంచి రూ.10 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల అభివృద్ధే ధ్యేయమని, అందుకు కృషి చేస్తానని తెలిపారు. రాబోయే రోజుల్లో శాయంపేట మండలానికి మరిన్ని నిధులు కేటాయించి, అన్నివిధాలా మండలాన్ని అభివృద్ధి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎస్సార్ వెల్లడించారు. పత్తిపాక గ్రామానికి పద్మశాలి కమ్యూనిటీ భవనాన్ని కేటాయించినందుకు గాను, గ్రామానికి చెందిన పలువురు పద్మశాలీలు ఎమ్మెల్యే గండ్రకు శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, అధికార ప్రతినిధి చిందం రవి, నాయకులు పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, చల్ల చక్రపాణి, మాజీ సర్పంచులు చిట్టి రెడ్డి రాజిరెడ్డి, అబ్బు ప్రకాష్ రెడ్డి, సంఘం చైర్మన్ గుర్రం రమేష్, రేణిగుంట్ల సదయ్య, డైరెక్టర్ కందగట్ల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుడి కాళ్ల పైనుంచి వెళ్లిన బస్సు

## తీవ్ర గాయాలు, హాస్పిటల్‌కు తరలింపు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక బస్టాండు సమీపంలో శుక్రవారం దారుణం చోటు చేసుకుంది. హనుమకొండ బస్టాండు ఎదురుగా ఉన్న జంక్షన్ వద్ద వృద్ధుడు రోడ్డు దాటుతుండగా వృద్ధుడి కాళ్ల పై నుంచి బస్సు వెళ్లడంతో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గాయాలైన వృద్ధుడిని హాస్పిటల్ కు తరలించారు.

# స్పోర్ట్స్ సిటీగా హనుమకొండ

## క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్వల్ప వ్యవధిలోనే గణనీయమైన ప్రగతిని సాధిస్తూ హనుమకొండ స్పోర్ట్స్ సిటీగా మారుతోందని తెలంగాణ రాష్ట్ర క్రీడలు యువజన, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి ఎ.వాణి ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధితో పాటు క్రీడా పాఠశాల ఎంపికలను పర్యవేక్షించారు. తొలుత స్టేడియంలోని అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ ను పరిశీలించారు. కుడా ఆధ్వర్యంలో గ్రాస్ నిర్మాణంతో పాటు నగర మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో ట్రాక్ మధ్యలో నూతనంగా రెజ్లింగ్ హాల్ నిర్మిస్తుండడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. శిథిలావస్థలో ఉన్న బాలికల వసతి గృహాన్నిఆమె పరిశీలించారు. కొత్త భవన నిర్మాణం ప్రారంభమయ్యేలా చొరవ తీసుకోవాలని డీవైఎస్ ఓ అశోక్ కోరారు. నాటి కమిషనర్ నేటి హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు డీవైఎస్ ఓ వివరించారు. అనంతరం స్టేడియంలో నిర్వహిస్తున్న క్రీడా పాఠశాల ఎంపికల నిర్వహణ తీరును పరిశీలించారు. దీనిలో భాగంగా 800 మీటర్ల పరుగు పందెం ఆమె జెండా ఊపిరి ప్రారంభించారు. ఎంపికల్లో పాల్గొన్న విద్యార్థులతో ఆమె ముచ్చటించారు. మెరుగైన ప్రతిభ కనబరిచి ఎక్కువ మంది విద్యార్థులు క్రీడా పాఠశాలలకు ఎంపికవాలన్నారు. తదనంతరం బస్టాండ్ సమీపంలో ఉన్న యువజన శాఖ నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ కేంద్రంలో శిక్షణ పొందుతున్న కంప్యూటర్, టైలరింగ్ శిక్షణార్థులతో శిక్షణ కార్యక్రమ నిర్వహణ గురించి తెలుసుకున్నారు. స్వల్ప వ్యవధిలోనే విశేష అభివృద్ధికి కృషి చేస్తున్న జిల్లా క్రీడలు యువజన శాఖ అధికారి గుగులోతు అశోక్ కుమార్ ను ఈ సందర్భంగా ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో టూరిజం శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ సూపరింటెండెంట్ మహ్మద్ నయీం, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శులు బి.కైలాసం యాదవ్, తోట శ్యాం ప్రసాద్, స్పోర్ట్స్ అథారిటీ కోచ్ లు పాల్గొన్నారు.

# నిట్‌లో ఇంజినీర్లకు ఐదు రోజుల శిక్షణ




**వరంగల్ వాయిస్, నిట్ వరంగల్ :** నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్ ) వరంగల్ గ్రామీణ రోడ్ల నిర్మాణం, నిర్వహణకు బాధ్యత వహించే ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్ వై) ఇంజినీర్ల కోసం ఐదు రోజుల ఎగ్జిక్యూటివ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించింది. ఈ శిక్షణా కార్యక్రమాన్ని భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ (మోర్డ్) ఆధ్వర్యంలోని నేషనల్ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్ఆర్ఐ డీఏ) స్పాన్సర్ చేసింది. దేశవ్యాప్తంగా గ్రామీణ రహదారుల పరిరక్షణ కోసం శాస్త్రీయ, క్రమబద్ధమైన పేవ్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (పీఎంఎస్) సూత్రాలతో ఇంజినీర్లను సన్నద్ధం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యం. ఈ సమస్యను పరిష్కరించడానికి నిర్వహించిన ఐదు రోజుల శిక్షణా కార్యక్రమంలో దేశవ్యాప్తంగా సుమారు 45మంది ఇంజినీర్లు పాల్గొన్నారు. ప్రొఫెసర్ సీఎస్ఆర్ కే.ప్రసాద్, ప్రొఫెసర్ వెంకయ్య చౌదరి, ప్రొఫెసర్ ఎస్.శంకర్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. శిక్షణ సందర్భంగా ఇంజినీర్లకు అవగాహన కల్పించేందుకు పేవ్‌మెంట్ నిర్వహణ, నిర్వహణ, పునరావాసం, పీఎంఎస్ కాన్సెప్ట్‌లపై కేస్ స్టడీస్‌పై, వివిధ అంశాలపై చర్చించారు. శిక్షణలో భాగంగా, ఇంజినీర్లు తెలంగాణలోని గ్రామీణ రహదారులను పీఎంజీఎస్ వై ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ (పీఐయూ), పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం, తెలంగాణ సహాయంతో సందర్శించి రహదారి పరిస్థితులపై శాస్త్రీయ అంచనాలను తెలుసుకున్నారు. నిట్ వరంగల్ ప్రారంభం నుంచి పీఎంజీఎస్ వై పథకంతో అనుబంధం కలిగి ఉంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పీఎంజీఎస్ వై ప్రోగ్రామ్‌ల కోసం స్టేట్ టెక్నికల్ ఏజెన్సీ (ఎస్ టీఏ) ప్రిన్సిపల్ టెక్నికల్ ఏజెన్సీ (పీటీఏ)గా పనిచేస్తుంది.

## కల్నల్ అజయ్ నంద ఖండూరికి ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక లాల్ బహదూర్ కళాశాల స్థానిక ఆర్మీ పదో తెలంగాణ ఎన్సీసీ బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ అజయ్ నంద ఖండూరి పదవీ విరమణ నేపథ్యంలో కాలేజి ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కే.రాజేందర్ రెడ్డి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఇండియన్ ఆర్మీలో కల్నల్ ఖండూరి ఈనెల 30న పదవీ విరమణ చేయి సందర్భంగా కళాశాల ఎన్సీ క్యాడేట్లు శుక్రవారం గౌరవ వందనం సమర్పించారు. దేశ రక్షణ కోసం యువత ముందుకు రావాలని, ఆర్మీలో ఎన్సీసీ ద్వారా ప్రవేశం పొందడం సులభమని, క్రమశిక్షణకు మారు పేరైన ఆర్మీలో చేరేందుకు ఎల్ బీ కళాశాల ఒక హబ్బు లాంటిదని కల్నల్ అజయ్ నంద ఖండూరి తెలిపారు. నగరంలో అన్ని వసతులతో ఎన్సీసీకి వెన్నుదన్నుగా ఉంటుందని ప్రిన్సిపాల్ తో పాటు ఆయన కొనియాడారు. యువత ఆర్మీలో స్థిరపడటం చాలా సులువని, క్రమశిక్షణతో శిక్షణ పొందితే భవిష్యత్తు ఎంతో గొప్పగా ఉంటుందని, భారతదేశానికి సేవ చేసినందుకు జన్మ ధన్యమైందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఆర్మీలో అధికారిగా దేశ రక్షణలో తన సేవలు ఎంతో గొప్ప సాహసవంతంగా చేశానని పేర్కొన్నారు. నూతన కమాండింగ్ అధికారి కల్నల్ సెంథిల్ రమాదురైకి స్వాగతం పలుకుతూ ఇద్దరినీ ఘనంగా సన్మానించారు. ఖండూరి పదవీ విరమణ 30 న జరగబోతున్న సందర్భంగా శాలువా, మెమొంటో, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్సీసీ ఆఫీసర్ కెప్టెన్ డాక్టర్ ఎం.సదానందం, సీనియర్ అండర్ ఆఫీసర్ ఏ.రాజ్ కుమార్, జూనియర్ అండర్ ఆఫీసర్ సంతోషి, జూనియర్ అండ్ ఆఫీసర్ కళ్యాణ్ కుమార్, జూనియర్ అండ్ ఆఫీసర్ వర్ష, క్వాటర్ మాస్టర్ సృజన, శృతి, భాగ్యలక్ష్మి, శివాని, విద్య, భాస్కర్, రజినీకాంత్, సాక్షి, హసియా పాల్గొన్నారు.

## దేశం దశ, దిశ మార్చిన నేత పీవీ

### దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేశం దశ, దిశ మార్చిన నేత పీవీ నరసింహారావు అని మాజీ చీఫ్ విప్, అధ్యక్షుడు బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. మాజీ పార్లమెంట్ సభ్యులు కెప్టెన్ లక్ష్మీ కాంత రావు, వినోద్ కుమార్ లతో కలిసి శుక్రవారం హనుమకొండ బస్టాండ్ వద్ద ఉన్న పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ తో కలిసి పీవీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ ముద్దు బిడ్డ పీవీ అని, ఆయనకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సముచిత గౌరవం కల్పించారన్నారు. పీవీ శతజయంతిని సైతం అధికారికంగా ఘనంగా నిర్వహించారని గుర్తు చేశారు. భారత దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న సైతం పొందారని, దేశ ప్రధానిగా సేవ చేశారని, ఆర్థిక సంస్కరణలను తీసుకొచ్చిన గొప్ప ఆర్థికవేత్త అని కొనియాడారు. గొప్ప పాలన దక్షుడు పీవీ నరసింహారావు అన్నారు. తెలంగాణ బిడ్డ, తెలుగువాడు దేశ ప్రధానిగా సేవలు అందించడం తెలుగు వారందరికీ, తెలంగాణ ప్రజలందరికి గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ కార్పొరేటర్ లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పశ్నించే గొంతుక ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

## పులి దేవేందర్ ముదిరాజ్



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** ఇటీవల ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తీన్మార్ మల్లన్న ఉమ్మడి వరంగల్' జిల్లా'కు విచ్చేసిన సందర్భంగా ఎంఈపీఏ టీజీ (మెపా తెలంగాణ) ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్, రాష్ట్ర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఓ హొటల్ లో జరిగిన కార్యక్రమంలో కలిసి ఆయనతో మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి, సన్మాన గ్రహీత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ ఈ విజయంలో భాగస్వాములైన మెపా పట్టభద్రులకు, ఈ నావిజయం కోసం పని చేసిన మెపా సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచిన ముదిరాజ్ల రిజర్వేషన్ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, రిజర్వేషన్ సాధన కోసమే మెపా మద్దతు ఇచ్చిందని, ఈ స్థానిక సంస్థల ఎన్నికల లోపే ముదిరాజ్'ల రిజర్వేషన్ సమస్యను పరిష్కారం చేయడం కోసం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని ఈ స్థానిక ఎన్నికలలోపే సమస్యను పరిష్కారం చేయాలని ఎమ్మెల్సీ నిధులతో ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాలోని విద్యార్థులకు విద్య, ఉద్యోగ, సాధికారత కోసం మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మెపా రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు ముదిరాజ్, దండు చిరంజీవి ముదిరాజ్, అచ్చునూరి కిషన్ ముదిరాజ్, చెన్న బోయిన సాయి శివ ముదిరాజ్, రావుల రాణా ప్రతాప్ ముదిరాజ్, సింగారపు రామ కృష్ణ ముదిరాజ్, పులి రాజేష్ ముదిరాజ్, సంకెళ్ల మహేందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎంను అడ్డుకుంటే అభివృద్ధిని అడ్డుకున్నట్టే

## యూత్ కాంగ్రెస్ నాయకుడు కల్లూరి పవన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రేపు హనుమకొండ, వరంగల్ జిల్లాల పర్యటన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అడ్డుకుంటామని కొందరు చేస్తున్న వ్యాఖ్యలను ఖండిస్తున్నామని యూత్ కాంగ్రెస్ నాయకులు కల్లూరి పవన్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పవన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు అయినప్పటికి కూడా సీఎం మాట ఇచ్చిన ప్రకారంగా హామీలు నెరవేర్చుకుంటూ వస్తున్నారని అన్నారు. ముఖ్యంగా హనుమకొండ, వరంగల్ నగరం అభివృద్ధి విషయంలో సీఎం సానుకూలంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హనుమకొండ అభివృద్ధి విషయంలో ఎప్పటికప్పుడు సీఎంతో మాట్లాడి కావాల్సిన నిధులు తెస్తున్నారని తెలిపారు. రేపు జరిగే అభివృద్ధి పనులకు వస్తున్న సీఎంను అడ్డుకుంటే అభివృద్ధిని అడ్డుకున్నట్టేనని ఆయన అన్నారు. 10 సంవత్సరాలలో బీఆర్ఎస్ చేయలేనిదీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపిస్తుందన్నారు.

# మృతుల కుటుంబాలకు చల్లా పరామర్శ



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని పైడిపల్లి, లక్ష్మీపురం గ్రామాలలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన బొచ్చు జనార్ధన్, కొండి బన్నీ, మునిగాల ఆగమ్మ, మంగలపల్లి శైలజ కుటుంబ సభ్యులను శుక్రవారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వారి మృతికి గల కారణాలను కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# పాఠ్య పుస్తకాలు విక్రయించే స్కూళ్లపై చర్యలేవీ



**వరంగల్ వాయిస్, పరకాల :** పాఠ్య పుస్తకాలు విక్రయించే ప్రైవేట్ స్కూళ్లపై చర్యలేవని ఎస్ఎఫ్ ఐ నాయకులు ప్రభుత్వాన్ని, అధికారులను ప్రశ్నించారు. పరకాల పట్టణంలో వివిధ ప్రైవేట్ పాఠశాలలలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరకాల పట్టణంలో విచ్చలవిడిగా పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్, నర్సరీ, యూకేజీ, ఫస్ట్ క్లాస్, సెకండ్ క్లాస్ ఇలా ఒక నర్సరీకే నాలుగు వేల రూపాయల చొప్పున ప్రైవేట్ యజమాన్యం విచ్చలవిడిగా వసూళ్లకుపాల్పడుతున్నారు. అదే విధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలను గుర్తించి వెంటనే పర్మిషన్ రద్దు చేయాలన్నారు. అదేవిధంగా బుక్ సెంటర్లలో పాఠశాల పేరు చెప్పి విచ్చలవిడిగా దోపిడీ చేస్తున్నారు. అలాంటి బుక్ స్టాల్ ను గుర్తించి సీజ్ చేయాలన్నారు. లేదంటే రాబోయే రోజుల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని కళ్యాణ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు మడికొండ ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్, మండల నాయకుడు బొజ్జ హేమంత్, కోకిల ప్రేమ్, సాయి తేజ పాల్గొన్నారు.

# నలుగురు కానిస్టేబుళ్లకు పదోన్నతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న నలుగురు కానిస్టేబుళ్లు కుమారస్వామి, యాకాంబరం, రాంప్రసాద్, రాజేష్ లకు హెడ్ కానిస్టేబులు గా పదోన్నతి కల్పిస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గత రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన కానిస్టేబుళ్ళు శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ను మర్యాద పూర్వకంగా కలుసుకోగా పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా పదోన్నతి పొందిన కానిస్టేబుళ్ల భుజాలపై హెడ్ కానిస్టేబుల్ పట్టీలను అలంకరించి అభినందనలు తెలియజేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పదోన్నతితో పాటు బాధ్యతలు పెరుగుతాయని, నిరంతరం బాధితులకు న్యాయం అందించేందుకు కృషి చేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు.

# నీట్ పరీక్ష లీకేజీ పై పార్లమెంట్‌లో చర్చ జరగాలి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** నీట్ ప్రవేశ పత్రాల లీకేజీ అంశంపై పార్లమెంట్ లో చర్చ జరపాలని, దోషులను కఠినంగా శిక్షించాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని, వారి తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులతో పాటు మనోవేదనకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ ప్రశ్నాపత్రాలను అంగట్లో సరుకుగా మార్చిన ఘనత బీజేపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. నీట్ పరీక్ష రద్దు చేయాలని దోషులను కఠినంగా శిక్షించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సంస్థను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతున్న ప్రధాని నరేంద్ర మోడీ నోరు మెదపక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. వికసిత భారత్ అంటే ఇదేనా అని ప్రశ్నించారు. పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ప్రసంగంలో దోషులను శిక్షిస్తామని చెబితేనే సరిపోదని, ఈ విషయంపై పార్లమెంట్ లో చర్చ జరపాలన్నారు. నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని, విద్యార్థులకు తగిన న్యాయం చేయాలని వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఏబీవీపీ ఆధ్వర్యంలో డీఈఓ ఆఫీస్ ముట్టడి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు డీఈఓ ఆఫీస్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి హనుమకొండ జిల్లా కన్వీనర్ సుజిత్ మాట్లాడుతూ తెలంగాణ వచ్చి పదేళ్లు గడిచిన కాలంలో పార్టీలు మారినా గానీ, విద్యార్థులు బతుకులు మారలేదన్నారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ బడిలోకి పోలేక గవర్నమెంట్ బడికి వెళ్తే కనీసం ఉండాల్సిన మౌలిక వసతులు కూడా ఉండడం లేదని మండిపడ్డారు. పిల్లలు ఉండే బడిలో పందులు కుక్కలు వస్తున్నాయని, తినే ఆహారం కూడా విషంగా మారి ఫుడ్ పాయిజన్ కు గురవుతున్నారన్నారు. ప్రభుత్వ బడిలో పరిస్థితులు ఇలా ఉన్నాయని ప్రైవేట్ బడికి వెళ్తే బుక్స్, ఫీజులు, యూనిఫాంలు అంటూ విచ్చలవిడిగా దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక నిరుపేదం కుటుంబం విద్యార్థులు ఎలా చదువుకుంటారని ప్రశ్నించారు. ప్రైవేట్ పాఠశాలలో యూనిఫామ్, బుక్స్ వాళ్లకి ఇష్టం ఉన్న రేట్లకు అమ్ముతున్నారని స్థానిక డీఈఓకు తెలియజేస్తే డీఈవో ఒక చేతితో తాళం వేసినట్టు వేసి ఇంకో చేయితో లంచం తీసుకొని వదిలేస్తున్నారని విమర్శించారు. స్థానిక డీఈఓకు నెలకు ఇచ్చే గవర్నమెంట్ జీతం కంటే కార్పొరేట్ విద్యాసంస్థల లంచం ఎక్కువ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అరుణ్, సమిత్ రెడ్డి, ఆఫీస్ సెక్రెటరీ భరత్, ఎస్ఎఫ్ డీ కన్వీనర్ రోహిత్, కళాశాల ప్రెసిడెంట్ సర్దార్, జోనల్ ఇంచార్జి హరిచరణ్, విష్ణు, శ్రీశాంత్, శ్రీనివాస్, ఠాగూర్, అభిరామ్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఏజెన్సీలో బాంబు స్క్వాడ్ తనిఖీలు




**వరంగల్ వాయిస్, ములుగు :** ప్రజల క్షేమం కోసమే ఏజెన్సీ ప్రాంతాల్లో బాంబు స్కాడ్ బృందాలతో ముమ్మరంగా తనిఖీ లు నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ శబరీష్ తెలిపారు. ఈ మేరకు ఎస్పీ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. మావోయిస్టులు తమ ఉనికిని చాటుకోవడం కోసం అసాంఘిక కార్యకలాపాలు జరపడం జరుగుతుందని, అందులో భాగంగా ఏజెన్సీలో మందు పాతరలు సైతం అమర్చుతున్నారని పేర్కొన్నారు. ఆదివాసీ ప్రజలు, వన్యప్రాణులు ప్రాణాలు కోల్పోతున్నాయన్నారు. కాగా, మందు పాతరలు అమర్చే అవకాశం ఉన్న అన్ని అనుమానిత ప్రాంతాలను బాంబు స్క్వాడ్ బృందాలచే విస్తృత తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో ఈ తనిఖీలను మరింతగా పెంచి నిఘా వ్యవస్థను మరింతగా బలోపేతం చేస్తామని వెల్లడించారు. ఇప్పటికే సాంకేతిక పరికరాలైన డ్రోన్ వంటి వాటిని ఉపయోగించి నిరంతరం నిఘా ఉంచుతున్నామని పేర్కొన్నారు. ఎవరూ కూడా మావోయిస్టులకు సహకరించవద్దని గుర్తు తెలియని, అనుమానిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించవలసిందిగా ఆయన కోరారు.

# సేనాపతి వయసుపై సందేహాలు

## అది ముఖ్యం కాదన్న దర్శకుడు శంకర్

కమల్ హాసన్  కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఫిల్మ్ 'భారతీయుడు2'  1996లో వచ్చిన 'భారతీయుడు' చిత్రానికి సీక్వెల్‌గా రాబోతోంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జులై 12న తమిళ, తెలుగు భాషలతో పాటు, ఇతర భారతీయ భాషల్లోనూ విడుదల కానుంది. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచింది. అయితే, వృద్ధుడైన సేనాపతి పాత్రలో కమల్‌హాసన్ ఫైట్ చేయడంపై సామాజిక మాధ్యమాల వేదికగా చర్చ నడుస్తోంది. ఎందుకంటే 'భారతీయుడు' చిత్రం జరిగే సమయానికి సేనాపతి పాత్రకు వయసు 75ఏళ్లుగా చూపించారు. ఆ లెక్క ప్రకారం 2024కు వచ్చే సరికి ఆ పాత్ర వయసు 103 సంవత్సరాలు. అంత వయసున్న వృద్ధుడు మార్షల్ ఆర్ట్స్ ఫైట్స్ చేయడం సాధ్యమేనా?అన్న ప్రశ్న దర్శకుడు శంకర్‌కు ఎదురైంది. దీనికి వివరణ ఇస్తూ సేనాపతి సాధారణ వ్యక్తిగా చూడొద్దని, సూపర్‌హీరోగా చూడాలంటూ సమాధానం ఇచ్చారు. 'సేనాపతి వృద్ధుడే కావచ్చు కానీ, సూపర్‌మ్యాన్. ఈ ప్రశ్న నన్ను చాలా మంది అడిగారు. నేను ఫస్ట్ పార్ట్ చేసినప్పుడు సీక్వెల్ గురించి ఆలోచనే లేదు. కేవలం ఆ ఒక్క చిత్రమే అనుకున్నా. అందుకు తగినట్లుగానే దాన్ని రాసుకున్నా. సేనాపతిని స్వాత్రంత్య సమరయోధుడిగా చూపించాలనుకున్నా. అందుకే అతడి పుట్టిన సంవత్సరాన్ని అందులో చూపించాం. సేనాపతి గురించి పోలీసులు విచారణ చేసే క్రమంలో అతడు పుట్టిన సంవత్సరం ఏంటో తెలుస్తుంది. అత్యధిక వయసు కలిగిన మార్షల్ ఫైటర్స్ ఇప్పటికీ ఉన్నారు. అది వారికున్న క్రమశిక్షణ, సాధన వల్ల సాధ్యమైంది. సేనాపతి కూడా అలాంటి వాడే. మర్మకళలో అతడు మాస్టర్. అందుకే నేను అతడిని సూపర్‌హీరోగా చూపించా. 'భారతీయుడు' కోసం వేసుకున్నట్లే ప్రోస్థటిక్ మేకప్ వేసుకోవడం విసుగ్గా అనిపించడం లేదా? అని కమల్‌ను ప్రశ్నించగా, 'సినిమా కథ ఆసక్తిగా లేకపోయినా, దర్శకుడు డిమాండ్ చేయకపోయినా అది సాధ్యమయ్యేది కాదు. ఇక ప్రోస్థటిక్ మేకప్‌లు వేసుకోవద్దని చాలా సార్లు అనుకునేవాడిని. కానీ, మంచి చిత్రాలు, కథలు రావటం వల్ల మళ్లీ నేను ఆ దిశగా పయనించాల్సి వస్తోంది' అన్నారు. 'భారతీయుడు2'లో సిద్దార్థ్, రకుల్‌ప్రీత్ సింగ్, ఎస్‌జే సూర్య, బాబీ సింహా, దివంగత నటుడు వివేక్, ప్రియా భవానీ శంకర్, బ్రహ్మానందం తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# అమెరికాలో కల్కి ఫోబియా

## వసూళ్లలో భారీ రికార్డు

ప్రభాస్ 'కల్కి' సినిమా సంచలనం సృష్టిస్తోంది. పురాణాలకు సైన్స్‌ను ముడిపెట్టి నాగ్ అశ్విన్ తెరకెక్కించిన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. ప్రభాస్‌తో పాటు అగ్రనటీనటుల నటనకు ఆడియన్స్ ఫిదా అవుతున్నారు. రిలీజ్‌కు ముందే ఎన్నో రికార్డులు సొంతం చేసుకున్న 'కల్కి'.. విడుదల తర్వాత కూడా హవా కొనసాగిస్తోంది. నార్త్ అమెరికాలో ఆల్ టైమ్ రికార్డును నమోదు చేసింది. నాగ్ అశ్విన్ ఈ చిత్రాన్ని  హాలీవుడ్ రేంజ్‌లో రూపొందించారు. దీంతో అక్కడి ప్రేక్షకులనూ ఈ సినిమా మెప్పిస్తోంది. నార్త్ అమెరికాలో ప్రీ సేల్ బుకింగ్స్‌లోనే పలు సినిమాల రికార్డులను బ్రేక్ చేసిన 'కల్కి'.. రిలీజ్ తర్వాత అన్నిటిని దాటి టాప్‌లో నిలిచింది. ప్రీమియర్స్ కలెక్షన్స్‌లోనే 3.8 మిలియన్ డాలర్లతో అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రంగా రికార్డును సొంతం చేసుకుంది. ప్రీమియర్స్‌లోనే 'ఆర్ఆర్ఆర్' కలెక్షన్స్ క్రాస్ చేయడం విశేషం. ఈ సినిమా తర్వాత స్థానాల్లో 'ఆర్ఆర్ఆర్' (3.46మిలియన్లు), 'సలార్' (2.6ఓ), 'బాహుబలి2' నిలిచాయి. ప్రీమియర్స్, మొదటిరోజు కలెక్షన్స్ కలిపి అమెరికాలో 'కల్కి' 5 మిలియన్ డాలర్లు వసూలుచేసింది. అమెరికాలో ఎక్కువ కలెక్షన్లు సాధించిన తెలుగు సినిమాల్లో 'కల్కి' ఒక్క రోజులోనే 5వ స్థానాన్ని సొంతం చేసుకుంది. అలాగే అత్యంత వేగంగా 5 మిలియన్లు వసూలు చేసిన సినిమాగా రికార్డు నెలకొల్పింది. ఈ కలెక్షన్లు ఇలాగే కొనసాగితే బెంచ్ మార్క్‌ను క్రియేట్ చేయడం ఖాయమని అభిమానులు అంటున్నారు. ఈ వీకెండ్‌కు కలెక్షన్స్ మరింత పెరిగే అవకాశముందని అభిప్రాయపడుతున్నారు.



### భారతీయ సినీ పతాకను రెపరెపలాడించిన కల్కి

**చిరంజీవి ప్రశంసల వర్షం**

**మరో ప్రపంచంలోకి తీసుకెళ్లిందన్న రాజమౌళి**

తాజాగా మెగాస్టార్, చిరంజీవి , రాజమౌళి ఈ చిత్ర బృందాన్ని సోషల్ మీడియాలో అభినందించారు. ఈ మేరకు చిరు ట్వీట్ చేశారు. 'కల్కి గురించి  అన్ని చోట్ల చక్కని స్పందన వినిపిస్తోంది. నాగ్ అశ్విను మైథాలజీ, సైంటిఫిక్ జానర్ కథను ప్రభాస్, అమితాబ్, కమల్‌హాసన్, దీపికా వంటి భారీ క్యాస్టింగ్‌తో అద్భుతంగా తెరకెక్కించారు. నా అభిమాన నిర్మాతలు అశ్వినీదత్, ప్రియాంక, స్వప్నాలకు అభినందనలు. ప్యాషన్, కరేజ్‌తో టీమంతా సాధించిన సక్సెస్ ఇది. మన





సినిమాలు భారతీయ జెండాను మరింత ఎత్తున రెపరెపలాడేలా చేస్తున్నాయని అన్నారు. రాజమౌళి  సినిమా గురించి ట్వీట్‌లో రివ్యూ ఇచ్చారు. 'కల్కి' మూవీలో కొత్త ప్రపంచం నిర్మాణాన్ని ఇష్టపడ్డా. అద్భుతమైన సెట్టింగ్‌లతో ఇది నన్ను మరో ప్రపంచంలోకి తీసుకెళ్లింది. డార్లింగ్ తన టైమింగ్, టాలెంట్‌తో చంపేశాడు. అమితాబ్ జీ, కమల్ సర్, దీపిక నుంచి ఫుల్ సపోర్ట్ దొరికింది. అయితే సినిమా చివరి 30 నిమిషాలు నన్ను ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లింది. తమ ఎలాన్‌ను అమలు చేయడంలో వందశాతం ప్రయత్నం సక్సెస్ సాధించారు. నాగి, అలాగే మొత్తం వైజయంతి టీమ్‌కు అభినందనలు' అంటూ పోస్ట్ చేశారు.

ప్రభాస్ పెద్దమ్మ శ్యామలా దేవి ఆయనపై ప్రశంసల వర్షం కురిపించారు. 1000 రెబల్ స్టార్‌లను కలిపితే అది ప్రభాసః అంటూ ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఈ సినిమాని ఆదరించిన పవన్ కల్యాణ్ ఫ్యాన్స్, ఇతర హీరోల ఫ్యాన్స, మా కుటుంబ అభిమానులకు హృదయపూర్వక కృతజ్ఞతలు. వాటి గురించి చెప్పేందుకు మాటల్లేవ్' అంటూ ఆనందం వ్యక్తం చేశారు.



# అండమాన్‌లో సూర్య, పూజాహెగ్డేలపై చిత్రీకరణ



కథానాయకుడు సూర్య ప్రస్తుతం తన 44వ చిత్రంతో సెట్స్‌పై బిజీగా ఉన్నారు. కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాని 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్, స్టోన్‌బెంచ్ ఫిల్మ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. పూజా హెగ్డే కథానాయిక. ఈ చిత్ర తొలి షెడ్యూల్ కొన్నాళ్ల క్రితమే అండమాన్‌లో ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఇప్పుడిది ముగింపు దశకు చేరుకుంది. ఈ షెడ్యూల్‌లో భాగంగా ఇప్పటికే సూర్య, పూజలపై రెండు పాటలు చిత్రీకరించినట్లు సమాచారం. అలాగే సూర్యపై ఓ యాక్షన్ సీక్వెన్స్ తెరకెక్కించినట్లు తెలిసింది. ప్రస్తుతం ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారని.. జులై తొలి వారాంతానికి ఈ షెడ్యూల్ పూర్తవుతుందని తెలుస్తోంది. ఇక రెండవ షెడ్యూల్‌ను జులైలోనే ఊటీలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నట్లు వార్తలొస్తున్నాయి. ప్రేమ, యాక్షన్, వినోదాల మేళవింపుతో ఉన్న ఓ ఆసక్తికర కథతో ఈ చిత్రం రూపొందుతోంది. ఈ సినిమాకి సంతోష్ నారాయణన్ సంగీతమందిస్తున్నారు.

# విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

## రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క





**వరంగల్ వాయిస్, ములుగు :** విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతోపాటు వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క కోరారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రా మిశ్రాలతో కలిసి ఏటూరు నాగారం ఆకులవారి ఘనపురంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ వసతి గృహాన్ని పరిశీలించిన మంత్రి తర్వాత విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆహారం సరిగా ఉంటే విద్యార్థులు చదువుపై దృష్టి పెడతారన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, స్కిల్ డెవలప్ మెంట్ తగతులపై ఆసక్తి చూపాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. జీవిత లక్ష్యాలను ఎంచుకోవాలని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. పౌష్టిక ఆహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, ఏటూరు నాగారం ఏఎస్పీ మహేష్ బాబా గీతే, ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వసంతరావు, ఏటీడబ్ల్యూఓ దేశిరం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### మేడారం సందర్శన..

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామంలోని వన దేవతలైన సమ్మక్క–సారలమ్మ వనదేవతలను శుక్రవారం రాష్ట్ర మంత్రి సీతక్క దర్శించుకొని మొక్కలు చెల్లించుకున్నారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థ పి.శ్రీజ లతో పాటు ఆలయ పూజారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మంగపేట మండల కేంద్రంలో రూ.1.29 కోట్ల నాబార్డ్ నిధులతో నిర్మించిన 10 గదులు, 10 షటర్ లు, రైతు సేవ సహకార సంఘం కాంప్లెక్స్ భవనాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్., ఐటీడీఏ పీవో ప్రాజెక్ ఆఫీసర్ చిత్రా మిశ్రాలతో కలిసి మంత్రి ప్రారంభించారు. అదే విధంగా ములుగు జిల్లా మంగపేట గ్రామంలోని గోదావరి నదిపై నిర్మిస్తున్న కరకట్టను జిల్లా కలెక్టర్ దివాకర, ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రా మిశ్రాలతో కలిసి మంత్రి పరిశీలించారు.



# శ్రీనివాస్ కుటుంబానికి ఆర్థిక సాయం

## రూ.25వేల చెక్కు అందించిన ప్రెస్ క్లబ్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజాపక్షం విలేఖరిగా పనిచేస్తూ ఇటీవల అకాల మరణం చెందిన అకినెపల్లి శ్రీనివాస్ కు వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.25వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ మేరకు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి ఆధ్వర్యంలో రూ.25వేల చెక్కును శ్రీనివాస్ భార్య, కూతుళ్లకు అందజేశారు. అలాగే విలేఖరులు వ్యక్తిగతంగా అందించిన ఆర్థిక సాయం మొదట రూ. 10వేలు అందించగా, మరో రూ.8వేలు కూడా శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, వరంగల్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు గోకారపు శ్యామ్, పొడిశెట్టి విష్ణు వర్ధన్, జర్నలిస్టులు ఎస్.ప్రభాకర్, కనక రాజు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

## ఎమ్మెల్యేలను కలిసిన సిక్స్ మెన్ కమిటీ



**వరంగ్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజులను ప్రెస్ క్లబ్ సిక్స్ మెన్ కమిటీ శుక్రవారం కలిసింది. నగరంలోని రెండు సొసైటీల స్థలాలు వెంటనే క్లియర్ చేయాలని, అదే విధంగా సొసైటీల్లో లేని వర్కింగ్ జర్నలిస్టులకు కూడా అవసరమైన స్థలాన్ని కేటాయించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యేలు రేపు సీఎం రేవంత్ రెడ్డితో స్పష్టమైన ప్రకటన చేయించి, భూకేటాయింపులకు సంబందించి అధికారులకు ఆదేశాలు జారీ చేసేలా కృషి చేస్తామని సిక్స్ మెన్ కమిటీకి హామీ ఇచ్చారు.




# కేయూలో శుద్ధ జలం

## వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన రిజిస్ట్రార్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విద్యార్థులు సౌకర్యార్థం కాకతీయ విశ్వవిద్యాలయ ఇంచార్జి వైస్ ఛాన్సలర్ వాకాటి కరుణ ఆదేశాల మేరకు కేంద్ర గ్రంథాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ను రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డెవలప్మెంట్ ఆఫీసర్ ఆచార్య ఎన్.వాసుదేవ రెడ్డి, ఇంజనీరింగ్ పొన్నాల రామయ్య, డాక్టర్ ఎం.నరసింహ రావు, రవిశంకర్, జితేందర్, గ్రంథాలయ అధికారులు ఇజాక్ ప్రభాకర్, తేజావత్ జావేర్, గ్రంథాలయ సిబ్బంది, బిల్డింగ్ డివిజన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పీవీకి ఘన నివాళి..

పీవీ.నరసింహ రావు గొప్ప దార్శనికుడని కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి అన్నారు. పీవీ.విజ్ఞాన కేంద్రం సంచాలకులు డాక్టర్ జి.కిష్టయ్య అధ్వర్యంలో విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అయన స్పూర్తిని నేటి తరం విద్యార్థులు, ఉద్యోగులు కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.నరసింహ చారి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి, విభాగ అధిపతులు డాక్టర్ రమ, డాక్టర్ ఆర్.భార్గవి శర్మ, డాక్టర్ సంకేనేని వెంకట్, డాక్టర్ సోమయ్య, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ పి.వెంకటయ్య, డాక్టర్ రమేష్, డాక్టర్ సాయిదా, డాక్టర్ మమత, డాక్టర్ వంగాల సుధాకర్, బుర్రా సృజన తదితర ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

## మంత్రి సురేఖకు వినతి

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** కాకతీయ టెక్స్ టైల్, వీవర్స్ సంక్షేమ పొదుపు, పరపతి పరస్పర సహాయక సహకార సంఘం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖను శుక్రవారం హనుమకొండ రాంనగర్ లోని వారి నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు అసోసియేషన్ సభ్యులు కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు చిప్ప వెంకటేశ్వర్లు నేతృత్వంలో తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మంత్రికి అందజేశారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. వారి సమస్యలను ఓపికతో విన్న మంత్రి సురేఖ టెక్స్ టైల్స్, హ్యాండ్లూమ్ శాఖకు ఎండార్స్ చేశారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నేతన్నల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని స్పష్టం చేశారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీరాములు, జనరల్ సెక్రటరీ రంగస్వామి, ట్రెజరర్ జ్యోతి భాస్కర్, గౌరవాధ్యక్షులు దర్గా స్వామి, వైస్ ప్రెసిడెంట్ కె.విజయ్ కుమార్, మాజీ ఉపాధ్యక్షులు కూరపాటి ఐలయ్య, డైరక్టర్ మామిడి రాజు, దగ్గు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# పీవీకి ఘన నివాళి

**వరంగల్ వాయిస్, హుస్నాబాద్ :** హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలంలోని మాజీ ప్రధాని, రాజకీయ దురంతరుడు పీవీ నరసింహారావు స్వగ్రామం వంగరలో ఆయన 103 వ జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హాజరై పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు. అనంతరం పీవీ నివాసానికి వెళ్లి నివాళులు అర్పించారు. అక్కడే ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రసంగించారు. ఆదర్శప్రాయుడు పీవీ నరసింహారావు అని కొనియాడారు. ఆయన జీవిత చరిత్ర నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. పీవీకుమార్తె ఎమ్మెల్సీ వాణీ సెక్రటేరియట్ లో కలిస్తే ఛాంబర్ కి తీసుకుపోయి సన్మనించుకున్నానన్నారు. పీవీ సంతతి హైకోర్టు జడ్జిగా, ఇతర హెూదాల్లో ఉన్నారన్నారు.



# సీపీని కలిసిన వెస్ట్ జోన్ డీసీపీ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ వెస్ట్ జోన్ నూతన డీసీపీగా బాధ్యతలు చెపట్టిన రాజ మహేంద్ర నాయక్ శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూను మార్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఇరువురు అధికారులు వెస్ట్ జోన్ పరిధిలో శాంతి భద్రతలు, ఇతర విషయాలపై చర్చించుకున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com